వాయిస్ ఆఫ్ ప్రజలు
ప్రజల గొంతుక - నిజం కోసం..
తెలుగు దినపత్రిక



# ధాన్యం తరుగు కోతలకు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం బాధ్యత వహించాలి

### బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగిరెడ్డి కృష్ణారెడ్డి డిమాండ్



గంగాధర, మే06(వాయిస్ టుడే): చొప్పదండి నియోజకవర్గంలోని ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రంలో 'తరుగు' పేరుతో అదనపు ధాన్యం తూకం వేస్తున్న దోపిడీకి స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పూర్తి బాధ్యత వహించాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగిరెడ్డి కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు.గంగాధర చౌరస్తాలో బీజేపీ మండల అద్యక్షులు పంజాల ప్రశాంత్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున రైతులు బీజేపీ నాయకులు రాస్తా రోకో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వంపై,స్థానిక యంత్రాంగంపై నిప్పులు చెరిగారు. నాణ్యమైన ధాన్యాన్ని కూడా కావాలనే 'బి-గ్రేడ్'గా మారుస్తూ, క్వింటాల్‌కు రూ.20 చొప్పున ధరలో కోత విధిస్తున్నారని మండిపడ్డారు. చొప్పదండి నియోజకవర్గంలో రైతులను నిలువునా ముంచే కొత్త తరహా దోపిడీకి తెరలేపారని ఆయన ఎద్దేవా చేశారు.ఉద్దేశపూర్వకంగానే కొనుగోలు కేంద్రాలను ఆలస్యంగా ప్రారంభించారని,దీనివల్ల 17శాతం ఉండాల్సిన తేమ శాతం 11 కు పడిపోయిందన్నారు.దీనివల్ల రైతులు క్వింటాల్‌కు అదనంగా 6 కిలోల ధాన్యాన్ని నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఎఫ్‌సీఐ నిబంధనల కంటే తాలు తక్కువగా ఉన్నప్పటికీ, అధికార పార్టీ అండతో మిల్లర్లు చెలరేగిపోతున్నారని ధ్వజమెత్తారు. నియోజకవర్గంలో ఏ ఒక్క తహసీల్దార్ కూడా కొనుగోలు కేంద్రాలను సందర్శించకపోవడం వెనుక ఉన్న మర్మమేంటని ఆయన ప్రశ్నించారు.గత పదేళ్ల పాలనలో సంచికి 5-6 కిలోల తరుగు తీసి రైతులకు అన్యాయం చేసిన బీఆర్ఎస్ నేతలు,ఇప్పుడు అదే పని చేస్తున్న కాంగ్రెస్‌ను విమర్శించడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు.ఎలాంటి తరుగు కోతలు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి.కొనుగోలు కేంద్రాలకు లారీల సంఖ్యను వెంటనే రెట్టింపు చేయాలి.నాణ్యమైన ధాన్యాన్ని బి-గ్రేడ్ కింద కొంటున్న మిల్లర్లపై, బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న సివిల్ సప్లై అధికారులపై చీటింగ్ కేసులు నమోదు చేయాలి.రైతు ప్రయోజనాలను గాలికొదిలేస్తే బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు అన్నాడి కృష్ణారెడ్డి,బీజేపీ జిల్లా కోశాధికారి వైద రామానుజం,అసెంబ్లీ కన్వీనర్ పెరుక శ్రవణ్ కుమార్,ఓబీసీ జిల్లా అధ్యక్షులు దూలం కల్యాణ్, మాజీ మండల అధ్యక్షులు కోల అశోక్,ఎడవల్లి శశిధర్ రెడ్డి బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి, జిల్లా కిసాన్ మోర్చా నాయకులు తూమ్ నారాయణ,సర్పంచులు మల్యాల వినయ్ సాగర్,గుండెల్ని మల్లేశం,గంకిడి చంద్రారెడ్డి,ఉప సర్పంచులు గుండారపు మధు,గాలిపెల్లి శ్రీనివాస్, చంద్రశేఖర్,జిల్లా నాయకులు వినుకొండ నరసింహారెడ్డి,సుద్దాల రవీందర్ రెడ్డి, పెంచాల రాములు ఆకుల మనోహర్, మండల నాయకులు రేండ్ల శ్రీనివాస్,తాళ్ల రాజశేఖర్,బొమ్మ కంటి రాజిరెడ్డి,గుండె వెంకటేష్,సుద్దాల వంశీకృష్ణారెడ్డి,పృథ్వి గౌడ్,దయ్యాల ప్రణయ్,పుల్కం లక్ష్మణ్, రావుల సత్యనారాయణ,రేగుల భార్గవ్, గరిగంటి సుమన్,సుంకరి అనిల్, వోడ్నాల రాజు,బత్తిని శ్రీధర్,దాసరి ఆంజనేయులు,తుమ్ కరుణాకర్,పలమారి శ్రీనివాస్,సర్వ వినోద్,చిందం ఆంజనేయులు దేశెట్టి శ్రీనివాస్,మిట్ట గోపి,వేముల గంగన్న పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ కమిటీలు రద్దు, నూతన కమిటీల కసరత్తు

### ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎస్సీ సెల్ పరిశీలకునిగా కొరివి అరుణ్ కుమార్ నియామకం

### ఉత్తర్వులు జారీ చేసిన టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డా. కవ్వంపల్లి సత్యనారాయణ

### తన నియామకం పట్ల కృతజ్ఞతలు తెలిపిన కొరివి అరుణ్ కుమార్



కరీంనగర్, మే 06(వాయిస్ టుడే): టీపీసీసీ ఎస్సీ సెల్ నూతన కమిటీల నియామక ప్రక్రియలో భాగంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎస్సీ సెల్ పరిశీలకునిగా కరీంనగర్ జిల్లా మాజీ ఎస్సీ సెల్ చైర్మన్ కొరివి అరుణ్ కుమార్ ను నియమిస్తూ టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్,మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు.ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే,రాహుల్ గాంధీ, సోనియా గాంధీ,ఏఐసీసీ ఎస్సీ విభాగం నేషనల్ చైర్మన్ శ్రీ రాజేంద్ర పాల్ గౌతమ్,సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు రాష్ట్ర,జిల్లా ఎస్సీ విభాగ కమిటీల పునర్వ్యవస్థీకరణ జరుగుతోందని నియామక ఉత్తర్వులలో పేర్కొన్నారు. టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్‌గా నియమితులైన అనంతరం డా. కవ్వంపల్లి సత్యనారాయణ పాత కమిటీలను రద్దు చేసి,నూతన జిల్లా కమిటీల నియామక ప్రక్రియను ప్రారంభించారు.ఇందులో భాగంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాపరిశీలకునిగా కొరివి అరుణ్ కుమార్ ను నియమించారు.కొరివి అరుణ్ కుమార్ ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పర్యటించి,ఆయా జిల్లాల డీసీసీ అధ్యక్షుల అనుమతితో స్థానిక కాంగ్రెస్ నాయకులతో సమావేశాలు నిర్వహించి,నూతన రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సీ విభాగంలో మరియు జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ చైర్మన్ పదవులను ఆశించే అర్హత, ఆసక్తి గల కాంగ్రెస్ నాయకుల నుండి దరఖాస్తులు స్వీకరించనున్నారు. అనంతరం నియామకానికి సంబంధించిన నివేదికను టీపీసీసీ ఎస్సీ విభాగం చైర్మన్ డా. కవ్వంపల్లి సత్యనారాయణకు అందజేస్తారు. కావున రాష్ట్ర,జిల్లా ఎస్సీ విభాగాల్లో వివిధ నాయకత్వ పదవులను ఆశిస్తున్న నాయకులు తమ జిల్లా పరిశీలకుడైన కొరివి అరుణ్ కుమార్ ను సంప్రదించి,తమ బయోడేటా/దరఖాస్తులను అతి త్వరలో సమర్పించాలని ఉత్తర్వులలో కోరారు.తన నియామకం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ కొరివి అరుణ్ కుమార్ టిపిసిసి ఎస్ సి విభాగం చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలియజేశారు.



## ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా రైతు వారోత్సవాలు

### - మార్కెట్ చైర్మన్ పుల్లూరి స్వప్న సదానందం

జమ్మికుంట మే 6 (వాయిస్ టుడే): బుధవారం రోజు జమ్మికుంట కాటన్ మార్కెట్ యార్డులో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన"99 రోజుల ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" లో భాగంగా రైతు వారోత్సవాలు తెలంగాణ వ్యవసాయ మార్కెటింగ్ శాఖ వ్యవసాయ మార్కెట్ కమిటి ఆధ్వర్యం లో నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో భాగంగా"వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ అవకాశాలు" అనే అంశములపై మార్కెట్ చైర్మన్ పుల్లూరి స్వప్న- సదానందం రైతులకు వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతులకు కావాలసిన అన్ని సదుపాయాలు మార్కెట్లో కల్పించమని, రైతులు పండించిన తమ పంటలకు మంచి గిట్టుబాటు ధర కోసం దళారులను ఆశ్రయించకుండా నేరుగా మార్కెట్ యార్డుకు తీసుకొని వచ్చి తమ సరుకులను అమ్ముకోవాలన్నారు. రైతులు వారి సరుకులను అమ్ముకోవడానికి మార్కెట్ యార్డ్ కు వచ్చు క్రమంలో లేదా మార్కెట్లో అమ్ముకొని ఇంటికి వెళుతున్న క్రమంలో ఏదైనా ప్రమాదవశాత్తు ప్రమాదం జరిగినచో రైతు చనిపోతే రూ. ఒక (1) లక్ష, లేదా శాశ్వత అంగవైకల్యం అయితే రూ.75 వేల లేదా తాత్కాలిక అంగవైకల్యం జరిగినట్లయితే రూ. 25 వేల బీమా సౌకర్యం మార్కెట్ కమిటి ద్వారా అందించబడునని అని తెలిపినారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ తో పాటు కార్యదర్శి ఎన్. రాజు, వైస్ ఛైర్మన్ ఎర్రం సతీష్ రెడ్డి, గౌరవ సభ్యులు శ్రీపతి రెడ్డి, సునీల్, సతీష్, రాజేశ్వర రావు, సదానందం, సురేష్, దీక్షిత్, శ్రీనివాస్ రెడ్డి, రషీద్ పాషా, తిరుపతి, శ్యామ్ కుమార్, శ్రీనివాస్ గార్లు కేడిసిసి బ్యాంక్ సిబ్బంది, ప్యాక్స్ సిబ్బంది, సహకార బ్యాంక్ సిబ్బంది, అగ్రికల్చర్ సిబ్బంది, వ్యాపారస్తులు, హమాలీ, దాడువై కార్మికులు, ఆడకూలీలు, రైతు ప్రతినిధులు, మార్కెట్ సిబ్బంది మరియు (373) మంది రైతులు పాల్గొనడం జరిగినది. ఈ కార్యక్రమములో భాగముగా ఆదర్శ రైతులకు శాలువాలతో ఘనముగా సన్మానించడం జరిగినది. ఇట్టి కార్యక్రమము లో పాల్గొన్న రైతులకు మజ్జిగ ప్యాకెట్లు మరియు బిస్కెట్ మరియు వాటర్ బాటిళ్ళు పంపిణి చేయడం జరిగినది.




## చిగురుమామిడి రైతు వేదికలో ఘనంగా రైతు వారోత్సవాలు

### బ్యాంకు రుణాలపై అవగాహన - ఆర్థిక అభివృద్ధి దిశగా రైతులకు సూచనలు

చిగురుమామిడి, మే 6 (వాయిస్ ఆఫ్ ప్రజలు): రైతులు తక్కువ వడ్డీతో లభించే బ్యాంకు రుణాలను సమర్థంగా వినియోగించుకొని ఆర్థికంగా ఎదగాలని కేడీసీసీ బ్యాంకు మేనేజర్ స్రవంతి పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం నిర్వహించిన రైతు వారోత్సవాలు ఉత్సాహభరితంగా సాగాయి. ఈ సందర్భంగా రైతులకు పంట రుణాలు, ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ల ప్రాధాన్యతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బ్యాంకు మేనేజర్ స్రవంతి మాట్లాడుతూ, రైతులు తీసుకున్న రుణాలను సమయానికి చెల్లించడం ద్వారా భవిష్యత్తులో మరింత సులభంగా రుణాలు పొందే అవకాశాలు పెరుగుతాయని వివరించారు.

కో-ఆపరేటివ్ సబ్ రిజిస్ట్రార్ డి. వనజ రైతులకు సహకార సంఘాల ద్వారా లభించే రుణాలు, వివిధ సేవలపై వివరాలు తెలియజేశారు. మండల వ్యవసాయ అధికారి తాటిపల్లి పున్నం చందర్ మాట్లాడుతూ, పంటల సాగులో ఆర్థిక సహాయం ఎంత కీలకమో వివరించి, ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులు తమ అవసరాలకు అనుగుణంగా అందుబాటులో ఉన్న రుణ అవకాశాల గురించి సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించారు. ఇట్టి కార్యక్రమం రైతులకు ఆర్థిక అవగాహన పెంపొందించడంతో పాటు, వ్యవసాయ అభివృద్ధికి దోహదపడేలా మార్గనిర్దేశం చేసింది. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ శంకరయ్య, సీఈఓ కాటం నర్సయ్య, వ్యవసాయ విస్తరణ అధికారులు అంజలి, సాయి కుమార్, ప్రణయ్, అఖిల తదితరులు పాల్గొనగా, పెద్ద సంఖ్యలో రైతులు హాజరయ్యారు.




## గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచే కుట్ర పన్నుతున్న బీజేపీ ప్రభుత్వం

### సామాన్య ప్రజలపై భారం మోపితే చూస్తూ ఊరుకోం.

### సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు,మాజీ జెడ్పీటీసీ అందె స్వామి

కరీంనగర్,మే 06(వాయిస్ టుడే): కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం గ్యాస్,పెట్రోల్ ,డీజిల్ కొరతకు కారణమవుతూ ధరలు పెంచాలనే ఆలోచనతో ఉందని, సామాన్య ప్రజలపై భారం మోపితే చూస్తూ ఊరుకోమని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు,మాజీ జెడ్పిటిసి అందె స్వామి హెచ్చరించారు. పెట్రోల్ ,డీజిల్,గ్యాస్ అధిక ధరలకు వ్యతిరేకంగా సిపిఐ రాష్ట్ర సమితి పిలుపుమేరకు కరీంనగర్ లోని కమాన్ చౌరస్తా వద్ద సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో నిరసన తెలపడం జరిగిందని సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా అందె స్వామి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఒకలా ఎన్నికలయ్యాక మరోలా వ్యవహరించడం బీజేపీకే సాధ్యమని,సామాన్య పేద కుటుంబాలపై భారం వేయడానికి పెట్రోల్ డీజిల్ పై ఐదు రూపాయలు, వంట గ్యాస్ పై 50 రూపాయలు పెంచడానికి ఆయిల్ కంపెనీలు చూస్తున్నాయని ఇది ముమ్మాటికి కేంద్ర ప్రభుత్వ అసమర్థత అని స్వామి అన్నారు.రాష్ట్రంలో రైతాంగం పండించిన పంటలు కోసేసమయంలో పెట్రోల్,డీజిల్ కొరత ఏర్పడడం వల్ల రైతులకు ఇబ్బందులు తలెత్తుతాయని,చిన్న వ్యాపార వర్గాలపై ప్రభావం పడుతుందని, వాణిజ్య సిలిండర్ పై ఇప్పటికే 993 రూపాయలు పెంచడంతో అది 3100 రూపాయలకు చేరిందని, గృహవసరాలకు ఉపయోగించే వంట గ్యాస్ ధరలు పెంచినట్లయితే పేద కుటుంబాలు ఎలా జీవిస్తాయని, చమరు గ్యాస్ నిల్వలు ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం చెబుతూనే గ్యాస్ ధరలు పెంచడం దుర్మార్గమని, పెట్రోల్,డీజిల్ కొరతల వల్ల బంకుల వద్ద భారీగా జనాలు బారులు తీరుతున్నారని,ప్రభుత్వం మాత్రం ఎలాంటి కొరత లేదని చెప్పడం సరైంది కాదని,బీజేపీ ప్రభుత్వం తక్షణమే ధరలు పెంచే ఆలోచన విరమించుకోవాలని లేని పక్షంలో ప్రజా ఉద్యమాలు పెద్ద ఎత్తున నిర్వహిస్తామని అందె స్వామి హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి,జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపెల్లి రాజు,కటికరెడ్డి బుచ్చన్న యాదవ్,కసిరెడ్డి మణికంఠ రెడ్డి,బామండ్లపెల్లి యుగేందర్, బూడిద సదాశివ,నాయకులు నూనావత్ శ్రీనివాస్,పీ.సాంబయ్య, సందీప్ రెడ్డి పాల్గొన్నారు.



## హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో భారీ హనుమాన్ శోభాయాత్ర

### - హిందూ ధర్మమే దేశానికి రక్ష

### - మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్

జమ్మికుంట మే 6 (వాయిస్ టుడే): హిందూ ధర్మాన్ని కాపాడాలంటే మనకు రక్షణ కోసం హనుమాన్ ఉంటాడని, అలాంటి నమ్మకాన్ని వెలిబుచ్చాలంటే ఇలాంటి హిందూ యాత్రలు చేయాలని, అప్పుడే ధర్మం నాలుగు పా మీద నడుస్తుందని మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ అన్నారు. బుధవారం హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన హనుమాన్ శోభా యాత్ర లో ఆయన పాల్గొన్నారు. హనుమాన్ భారీ విగ్రహాలు, గేరెల్లా , మహిళా కోలాటాలు, వాయిద్యాలు , భారత నాట్యం లాంటి కార్యక్రమాలతో అంగ రంగ వైభవంగా ఈ శోభాయాత్ర ముందుకు సాగింది. జమ్మికుంట పట్టణంలో హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ శోభాయాత్ర లో ఉత్సవ సమితి నిర్వాహకులు ఆకుల రాజేందర్, పొనగంటి రవికుమార్, బచ్చు శివకుమార్, కడం సతీష్, సంపెల్లి సంపత్ రావు, పొన్నగంటి విష్ణు, పొనగంటి మల్లయ్య, దయ్యాల ప్రభాకర్, టంగుటూరి రాజకుమార్, సిరియాల విజయ పటేల్, ఆవుల తిరుపతి, పుట్టాల మల్లేష్, శీల జయ ప్రకాష్, పాకాల రవీందర్ రెడ్డి, చిత్రాల శ్రీనివాస్, కొండ్ల పాపయ్య, కొండ నగేష్, గర్రెపల్లి నిరూపమా, కంకణాల రమాదేవి, పొన్నగంటి శారద, ఎంసాని సమ్మయ్య, మరియు వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.



## చిగురుమామిడి సహకార సంఘానికి పునర్వైభవం

### సింగిల్ విండో చైర్మన్‌గా జంగా వెంకటరమణారెడ్డి బాధ్యతల స్వీకరణ

చిగురుమామిడి, మే 6 (వాయిస్ ఆఫ్ ప్రజలు): రైతుల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా సహకార సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు కట్టుబడి పనిచేస్తామని చిగురుమామిడి సింగిల్ విండో చైర్మన్ జంగా వెంకటరమణారెడ్డి స్పష్టం చేశారు. బుధవారం స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పాక్స్) కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన చైర్మన్‌గా, డైరెక్టర్లతో కలిసి ఘనంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు సేవ చేసే మరో అవకాశం దక్కడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు బలమైన అండగా నిలిచే సహకార సంఘం ద్వారా రైతులకు అందుబాటులో ఉండి, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. అంకితభావంతో సేవలు అందించి సంఘాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

గత పాలకవర్గమే తిరిగి బాధ్యతలు చేపట్టాలని ఉన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు మేరకు చైర్మన్‌తో పాటు పాలకవర్గ సభ్యులందరూ మరోసారి పదవులను స్వీకరించడం జరిగిందని ఆయన వివరించారు. కొనుగోలు కేంద్రాల వద్ద నిల్వలో ఉన్న వరి ధాన్యాన్ని మిల్లర్లకు సకాలంలో తరలించేలా చర్యలు తీసుకుంటామని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక దృష్టి సారిస్తామని చెప్పారు. బాధ్యతల స్వీకరణ అనంతరం జంగా వెంకటరమణారెడ్డిని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు కరివేద మహేందర్ రెడ్డి, చిట్టుమల్ల శ్రీనివాస్, అందె స్వామి, పోతరవేణి శ్రీనివాస్ యాదవ్, ముద్రకోల రాజయ్య, కూతురు రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.ం



## ఉచిత వైద్య సేవలపై ఉదారతను చాటాలి

### ప్రైవేటు ఆస్ప్రతులు,స్వచ్ఛంద సంస్థలకు ఎమ్మెల్యే కవ్వంపల్లి పిలుపు

కరీంనగర్,మే 06(వాయిస్ టుడే): పేదలకు ఉచిత వైద్య సేవలు అందించడంపై ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు ఉదారతను చాటుకోవాలని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ సెల్ చైర్మన్,మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు.కరీంనగర్ జిల్లా కేంద్రంలోని రెనీ హాస్పిటల్లో దివంగత బంగారి లక్ష్మీ - మైసయ్యల స్మారకార్థం శ్రీ మహేశ్వర చారిటేబుల్ ట్రస్ట్ ద్వారా ఉచిత కీళ్ల మార్పిడి శస్త్ర చికిత్సలు చేయించుకున్న 15 మందికి పేషెంట్ల డిశ్చార్జ్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ఖర్చుతో కూడుకున్న శస్త్ర చికిత్సలను ఉచితంగా అందించడం సంతోషకరమన్నారు. ఈ తరహా ఉచిత వైద్య సేవలు అందించేందుకు ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలే కాకుండా స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని ఆయన కోరారు.భవిష్యత్ లోనూ మరిన్ని వైద్య సేవలు అందించాలని ఆయన నిర్వాహకులు కోరారు.ఉచిత కీళ్ల మార్పడి శస్త్ర చికిత్సలు చేయించిన శ్రీ మహేశ్వర చారిటేబుల్ ట్రస్ట్ నిర్వాహకులను,రేనే ఆస్పత్రి యాజమాన్యాన్ని ఆయన అభినందించారు.ఈ కార్యక్రమంలో రేనే ఆస్పత్రి యాజమాన్యంతోపాటు పలువురు డాక్టర్లు,పేషెంట్ల తాలూకు బంధువులు పాల్గొన్నారు.

Printed by Published by : **Kotha Laxman** on behalf of Kotha Laxman, printed at and published at 10-5-336/2-1, Kishan Nagar, **Editor: Kotha Laxman.**